# నైజం

జోరున వర్షం పడుతోంది. అప్పుడప్పుడు మెరిసే మెరుపుల కాంతి తప్ప అంతా అంధకారంగా వుంది. రాత్రి పది గంటలు దాటకపోయినా వర్షం మూలాన వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

డాబాలమీదనుంచి, పెంకుటిళ్ళమీదనుంచి ధారగా ప్రవహిస్తున్న నీళ్లు జలపాతాలను గుర్తుచేస్తున్నాయి. పక్క భాగంలోని వారాల కుర్రాడు ఓవిన్నా వెలుగులో చదవడానికి అవస్థపడుతున్నాడు.

వానకి తడిసి చలితో ఒణికిపోతూ వరండాలో ఓమూల ముడుచుకుపడుకున్న ఊరకుక్క మధ్య మధ్య మోర యెత్తి ఏడుస్తోంది.

"ఛీ! ఛీ! వెధవకుక్క" అంటూ దాన్ని తరవడానికి ప్రయత్నించి విఫలుడయిన వారాల కుర్రాడు తిట్టుకుంటూ తిరిగి పుస్తకం చేతిలోనికి తీసుకున్నాడు,

ఆ కుక్కపాటి ఆశ్రయం దొరకని ఒక గుడ్డిముష్టివాడు,

వానని తనలో రగిలే ఆకలినీ తిట్టుకుంటూ ఓ గోనెపట్టా కప్పుకుని చెట్టుకింద ముడుచుకుని కూర్చున్నాడు. ఆ గోనెపట్టా అతన్ని వాననుంచి రక్షించలేదు సరికదా మరీ తడిపేస్తోంది.

కనిపించని దేవుణ్ణీ, తనేనాడూ కళ్ళారా చూడని హాయిగా ఇళ్ళల్లో పడుకున్న మనుష్యుల్నీ బండబూతులతో అర్చన చేస్తున్నాడు.

భయంకరమయిన ఆ రాత్రి ముమ్మూర్తులా కాళరాత్రిలా తోచింది సోమిదేవమ్మకి.

అంత హోరులోనూ భర్త మూలిగే మూలుగు భయంకరంగా వినిపిస్తోందామెకు. డాక్టరిచ్చిన నిద్రమాత్రలు ఏమీ పనిచెయ్యనట్టు ఆయన మూలుగే చెపుతోంది.

మెల్లగా లేచి బిందెలోనుంచి ఒక గ్లాసు మంచినీళ్ళు ముంచుకుని గడగడ తాగేసి, ఓసారి మూలిగే భర్తకేసిచూసి దీర్ఘంగా నిట్టూరుస్తూ మంచంమీాదికి ఒరిగింది సోమిదేవమ్మ.

పడుకున్నా ఆమె కంటికి నిద్దరా లేదుగానీ, ఆలోచనలు మాత్రం ఈగల్లా ముసిరేశాయి.

శాస్త్రిగారు ఒకప్పుడు బాగా బ్రతికినా ప్రస్తుతం మాత్రం సామాన్యులే.

పిల్లరు లేరు. ఒక ఆడపిల్లని పెంచి పెద్దచేసి పంపేశారు. అల్లుడికి కట్నకానుకల రూపేణా చాలా ముట్టజెప్పారు శాస్త్రిగారు. అవకాశవాది అయిన కూతురుకూడా రాబట్టగలిగినంత రాబట్టి మరీ వెళ్ళింది.

శాస్త్రిగారి బుద్ధిమాత్రం విషభాండం. ఆయనకి తగ్గ ఇల్లాలు సోమిదేవమ్మ. వారు బాగావున్న రోజుల్లో ఈసడించని మనిషి లేరంటే అతిశయోక్తి ఎంత మాత్రంకాదు. అందర్నీ విదిలించి పడేసేవారు.

శాస్త్రిగారు సంవత్సరం కన్న ఒక యింట్లో ఎక్కువ రోజులు ఉండేవాడుకాడు. స్తోమతవున్నా యిల్లుకొనే ఉద్దేశం గానీ, కట్టే ప్రయత్నంగానీ చెయ్యలేదు. కారణం, బుద్ధిగల వాడే అద్దెకుంటాడు, బుద్ధిలేనివాడే యిల్లు కడతాడు – అనే భావన నరాల్లో జీర్ణించుకోవడమే!

ఒకసారి ఆయన ఓ ఇంటి మైన్ పోర్షనులో అద్దెకుండే వాడు. అప్పుడే మేడమీద కాపురం వుంటున్న ఓ ముసలామె కన్నుమూసింది.

ఆవిడని కిందికి తిసుకురావాలంటే వీరి వీధిగుమ్మంముందు మెట్లమీదుగా రావాలి.

ఏమయినాసరే మా గుమ్మం తొక్కడానికి వీల్లేదని నానా హంగామా చేశారా దంపతులు.

"అందరం యేదో ఓ నాటికి పోవలసినవాళ్ళమేనమ్మా! కాస్త ముందూ, వెనుకా. అంతే! పోయినవాళ్ళకి కాస్త మర్యాదనిచ్చి కన్నీటితో సాగనంపటం మన కనీస కర్తవ్యం! కాదంటారా?" అన్న ఓ పెద్దమనిషిని పట్టుకుని కొట్టినంత పని చేసింది సోమిదేవమ్మ.

ఆ సంఘటనతో చాలామందికి వారంటే ఒకవిధమైన అసహ్యం పుట్టింది.

కాలక్రమేణా శాస్త్రిగారు ఆర్థికంగా చితికిపోయి పెద్ద ఇంట్లోంచి ఓ రెండుగదుల చిన్న పోర్షన్‌లోకి మారిపోయి, ఉన్నదంతా కేష్ రూపంగా మార్చి బేంక్‌లో వేసుకుని, ఆ వచ్చే వడ్డీతో భారంగా కాలాన్ని నెట్టుకొస్తున్నాడు.

మూలిగే నక్కమీద తాటిపండన్నట్లు, మూడునెలల క్రితం శాస్త్రిగారికి భయంకరమయిన కేన్సర్ వ్యాధి ముదిరిపోయి మరీ బయటపడింది.

మతిపోయిన సోమిదేవమ్మ అల్లుణ్ణీ, కూతుర్ని రమ్మని టెలిగ్రాం ఇప్పించింది, అవసానకాలంలో కూతురి పంచ చేరదామని.

వాళ్లు వెంటనే వచ్చినా "అక్కడ మా ఇల్లు చిన్నది, రోగి ఉండటానికి చాలదు...ఏదయినా జరిగితే మాత్రం వెంటనే ఫోన్ చెయ్యి, నీ ముందు రెక్కలు కట్టుకుని మరీ వాల్తాం" అనేసి మరికాసిని ధైర్యవచనాలు పలికి తిరుగు రైల్లో వెళ్ళిపోయారు.

ఉసూరుమంది సోమిదేవమ్మ మనసు. ఎంతో మందిని ఎన్నో విధాలా అర్థించింది. ఊళ్ళో వున్న బంధుజనంలో ఒక్కరు రాలేదు ఆవిడకి సహాయపడటానికి.

హాస్పిటల్లో చేసినా నాలుగురోజులు ఆ పరీక్షలు. ఈ పరీక్షలు చేసి గుంటూరో, రాయవెల్లూరో తీసుకుపొమ్మని పంపేశారు.

మంచంలో మూలుగుతున్న ముసలాయన్ని అలా

ఉంచేసి, బయట తాళంవేసుకుని మందులషాపుకెళ్ళి మందులు తెచ్చుకునే అరవయ్యేళ్ళ సోమిదేవమ్మని చూస్తూంటే కడుపు తరుక్కుపోయినట్టున్నా యెవరూ ఆమె నాదుకోనడానికి ముందుకు రాలేదు. బహుశా ఆమెకది తగిన శిక్షగా భావించారేమో!

శాస్త్రిగారి వ్యాధి సంగతి తెలిసిన మరుక్షణం నుంచి ఇంటి యజమాని ఆంజనేయులు ఇల్లుఖాళీ చెయ్యమని కూర్చున్నాడు. ప్రతిరోజూ వచ్చి ఓసారి గుర్తు చేస్తూనే ఉన్నాడు.

సోమిదేవమ్మకేం పాలుపోక బాధతో మెలికలు తిరిగే భర్తనోసారి జాలిగా చూసి ఆయనకివ్వవలసిన మందు మాకులు ఇచ్చి ఇల్లు తాళం పెట్టి అద్దె ఇళ్ళకోసం బయలు దేరింది.

పేట పేట తిరిగి వాచిన కాళ్లు చూసుకుంటూ, ఆయాసం వస్తే ఏ అరుగుమీదో కాసేపు చతికిలపడి తిరిగి వేటకోసం బయలుదేరింది.

కానీ, ఎంత తిరిగినా ఎవరూ ఆమెకి ఇల్లు ఇవ్వడానికి సాహసించలేదు.

కారణం, కేవలం వాళ్ళమీదున్న అసహ్యం మాత్రమే కాదు చూస్తూ చూస్తూ ఒకమనిషి చావడం కోసం, ఇల్లెవరిస్తారు?...అంతా తలా ఒక సానుభూతి వాక్యం పలికి మరీ పంపేవారు.

మూడురోజుల నుంచీ ఇంటాయన మరీ పీకల మీద కూర్చున్నాడు, ఇల్లు కాళీ చెయ్యమని.

*　*　*

భూమి అదిరేలా పెద్దగా ఉరిమి ఎక్కడో పిడుగు పడింది. ఆలోచనల్లో ఉన్న సోమిదేవమ్మ తృళ్ళిపడి భర్త కేసి చూసింది. ఎప్పుడు నిద్ర పట్టిందో గానీ మంచి నిద్రలో వున్నాడాయన.

మెల్లగా కళ్ళు మూసుకుంది.

'టక టక' తలుపు చప్పుడయింది. ఎందుకో సోమిదేవమ్మ గుండె ఝల్లుమంది, మెల్లగా లేచి తలుపు తీసింది.

తనూహించినట్లే ఇంటాయన యముడిలా నిలుచుని ఉన్నాడు. ఓసారి భర్త కేసి చూసి ముందు గదిలోకొచ్చి తలుపు లాగింది ఆయనకి వినిపించ కూడదన్నట్టు.

"ఏమిటి బాబూ! ఇంత వానలో?" అంది, విషయం తెలిసినా తెలియనట్టు.

"ఏముందమ్మా! మీకు తెలియని దేముంది? మళ్ళీ పొద్దున్నే నేను ఊరుపోవాలి. అందుకే ఇప్పుడొచ్చాను" అన్నాడు వినయంలో గొన్తా.

"బాబూ, ఇల్లెక్కడా దొరకలేదండీ" అంది సోమిదేవమ్మ గద్గద స్వరంతో.

"బావుంది! దొరక్కపోతే నేనేం చెయ్యను? మూణ్ణెల్ల నుంచీ చెపుతూన్నాను. నాదీ పదిమంది గల కుటుంబం పది కాపరాలున్న ఇల్లు పాడుపడితే నా గతేంగాను?" అన్నాడాయన నికచ్చిగా.

సోమిదేవమ్మ ఒణికిపోయింది.

"లేదు బాబూ, అలాంటి సమయంలో యింట్లో వుంచను!" దుఃఖాన్ని అణిచిపెడుతూ అంది.

"అలాకాదమ్మా! కాస్త నన్నుకూడా అర్థం చేసుకోండి. వాన రాకడ, ప్రాణి పోకడ యెవరు మాత్రం చెప్పగలరు? వూరినిండా మీ బంధుజనం కావల్సినంత మంది ఉన్నారు. దగ్గర్లో మీ కూతురూ వుంది. ఎక్కడో ఒకచోట చూసుకోవాలిగానీ ఇలా నా పీకలమీదికి తెస్తే యెలా? ఇదే ఆఖరుసారి చెప్పడం. ఆ తరువాత నన్ను నిందించి ప్రయోజనం లేదు" ఖరాఖండిగా చెప్పి వెళ్ళాడు ఆంజనేయులు.

సోమిదేవమ్మ అలా నిల్చుండి పోయింది. ఆమెకి ఏడుపు కూడా రావడంలేదు.

"ఎలా? ఇప్పుడెక్కడికి వెళ్ళాలి? ఈ పరిస్థితుల్లో తమకి ఇల్లెవరిస్తారు ? అయినవాళ్ళందరితో పాటు కూతురు కూడా ముఖం చాటేసింది. వీడు చూస్తే రేపు ఇల్లు ఖాళీ చెయ్యకపోతే చెంబూ, తప్పేలా వీధిలో పారేసేలా ఉన్నాడు. వాడంతటివాడేకూడ."

"అమ్మగారూ!"

త్రుళ్ళిపడింది సోమిదేవమ్మ.

ఆ వీధిలో పెరుగమ్ముకునే పున్నమ్మ గొంతది.

"ఎవరూ, పున్నమ్మా?"

"అవునమ్మా! నేనే" అంటూ లోనికొచ్చింది పున్నమ్మ.

"ఏమిటి పున్నమ్మా ఈ సమయంలో నువ్వు!"

"ఏం చెయ్యనమ్మా! సాయంత్రమనగా ఆంజనేయులు బాబుగోరి దగ్గర డబ్బు పట్టికెడదామని వచ్చి, వానమూలంగా ఇక్కడ చిక్కడిపోయా మావోల్లు ఎంత కంగారుపడుతున్నారో ఏంవోఁ" అంది పున్నమ్మ.

"కూర్చో పున్నమ్మా" అంది సోమిదేవమ్మ.

"బాబుగోరు తంవన్ని ఇల్లు ఖాళీ చెయ్యమన్నట్టున్నారు" అంది పున్నమ్మ ఓ మూలగా చతికిల పడుతూ.

"అవును పున్నమ్మా! యేం చెయ్యాలో అర్థం కావటం లేదు. యెక్కిన గడప యెక్కకుండా అన్ని గడపలూ ఎక్కి యాచించాను, కాస్త నీడ యిమ్మని. ఊఁహూఁ! యెవ్వరూ యివ్వలేదు యిప్పుడీయన పీకలమీద కూర్చున్నాడు." దుఃఖంతో ఆవిడకి మాట పెగలటంలేదు.

"ఇన్నాను, అంతా ఇన్నాను!. ఆ బాబు గారు అంత అన్నాయంగా మాటాడతంటే యెవరు సెప్పగల్రు? కట్టానికో ఇల్లు, సుకానికో ఇల్లూనా? బిడ్డా పాపా గలవోడు ఆయనే ఇలా మాటాడితే ఇంక భూమ్మీద బతికేదెట్లా? మనం సేసే పన్లు నరుడూ, నారాయణుడు మెచ్చొద్దూ?" అంది పున్నమ్మ ఆవేశం, బాధా మిళితమైన కంఠంతో.

"నిజమేపున్నమ్మా!... కానీ, ఇల్లాయనది. పొమ్మంటే పోక తప్పదు కదా! నాకర్మ ఎలా రాసిపెట్టివుంటే అలా జరుగుతుంది. ఆ రోజుల్లోనే నాది అన్న ఓ గుడిశ ఏర్పరచుకుంటే

ఈనాడు ఇంత అగచాట్లు పడాల్సిన అవుసరం వుండేది కాదు. కానీ, ఏం చేస్తాం” అంది సోమిదేవమ్మ బాధగా.

“మీరుండడమ్మా! లోకం గొడ్డు పోలేదు మనకి బగ మంతుడి సాయం ఉండనే వుంటది. మీ కబ్బెతరం లేకుంటే నా ఇంటికి రండి! మీకు తెలుసుగా నాకో ఇల్లుంది, అది అద్దిల కిస్తానసీ, అందులో ఓ భాగం కాళీగా ఉంది, మా వోల్లెవరో అడిగితే ఉంచాను” అంటున్న పున్నమ్మకేసి నిర్ఘాంతపోయి చూసింది సోమిదేవమ్మ.

“ఏంటమ్మా! మా ఇంటికి రావటానికి సందేయిస్తున్నారా? మేం తప్ప మిగతా అందరూ మీవొల్లే! పెద్ద లిచ్చిన కొంపలు మావోల్లంతా అమ్ముకున్నా నేనమ్మ నేదు.

ఏదో పదిగొడ్ల నెట్టుకుని పాలు, పెరుగు అమ్ముకుంటూ, ఆ ఇల్లు కొంత అద్దెకిచ్చి, అలా ఆయిగా బతికేస్తున్నా! నా బిడ్డలూ మంచోల్లె కనక అంత బాద నేదు, అందుకే దయిర్నం సేసె మిమ్మల్ని రమ్మంటున్నా...మీ కబ్బెతరం...”

“ఛ! ఛ! అదికాదు పున్నమ్మా! నీ సహాయం లభిస్తోందే అన్న సంతోషంతో మాట రాలేదంతే! నీలాంటి వాళ్లు ఉంటబట్టే లోకం ఇంకా నిల్చి వుంది. నీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో అర్థం కావటం లేదు” అంది సోమిదేవమ్మ. పున్నమ్మకేసి కృతజ్ఞతగా చూస్తూ.

ఏటిలో కొట్టుకుపోతున్న ఆమెకి పున్నమ్మ సహాయం పూల పడవలా తోచింది. పున్నమ్మలో దేవత కనిపించింది.

"కులమేదైతేనేం? మనసు గొప్పది!" అనుకుని మనసులోనే ఆమెకి నమస్కారించింది సోమిదేవమ్మ.

*  *  *

మర్నాడు ఉదయానికల్లా వానపూర్తిగా తగ్గిపోయింది. పున్నమ్మ సహాయంతో శాస్త్రిగార్ని ఆమె యింటికి చేర్చి హాయిగా నిట్టూర్చింది సోమిదేవమ్మ.

కేవలం చావుకి ఇల్లు ఇచ్చిన పున్నమ్మని పిచ్చిదానిలా చూశారంతా. కోడళ్ళు, తిట్టిపోశారు కొడుకులు గొణుక్కున్నారు.

అందరి మాటలకీ చల్లగా నవ్విందే తప్ప మారు మాట చెప్పలేదు పున్నమ్మ.

*  *  *

పున్నమ ఇంట్లోకెళ్ళిన శాస్త్రిగారు యమయాతనలన్నీ అక్కడే అనుభవించి పైలోకానికి తరలిపోయాడు.

పదిహేను రోజులు గడిచాయి. దూరానవున్న సత్రవులో కర్మకాండలన్నీ యథావిధిగా పూర్తి చేయించి కూతురితో సహా చుట్టపక్కాలంతా వెళ్ళిపోయారు.

ఆ రోజే సోమిదేవమ్మ మూటా, ముల్లె హడావిడిగా కడుతుంటే పున్నమ్మ చూసి—

"ఏంటమ్మగోరూ సామాన్లు సర్దుతున్నారు?" అంది లోనికొస్తూ.

"మరేంలేదు పున్నమ్మా మావాళ్ళింటిదగ్గర ఓ మంచి

పోర్షన్ ఖాళీ అయిందట. యిదిగో మా మేనకోడలు వచ్చి చెప్పింది. ఎడ్వాన్సు కూడా ఇచ్చేసి, ఈరోజు మంచిదికదాలని, నన్ను తీసికెళ్ళడానికొచ్చింది. యిదిగో అన్నీ సర్దేశాక పిల్చి చెప్దామనుకున్నాను. యింతలో నువ్వే వచ్చేశావ్! నీకు నిండా నూరేళ్ళాయుష్షు! గిన్నెలు గోనెసంచిలో పడేస్తూ అంది సోమిదేవమ్మ.

అప్పుడు చూసింది పున్నమ్మ పక్కనున్న అవిణ్ణి. ఆ మేనగోడలే లంకంత సొంతకొంప ఉంచుకుని స్వయానా మేనత్త కష్టంలో ఒక గది ఇమ్మని బ్రతిమాలితే నిర్మొహమాటంగా ఇవ్వనన్న మహా ఇల్లాలు!

మౌనంగా బయిటకొచ్చేసింది పున్నమ్మ.

"ఏమిటత్తా! దానిముఖం అలా పెంకులా అయిపోయిందీ?" వ్యంగ్యంగా అంది మేనకోడలు.

"ఆఁ! దానిబొంద! నేను శాశ్వతంగా దీనింట్లోనే వుండిపోతాననుకుంటోంది. యెంత బ్రాహ్మణ వీధైతే మాత్రం పక్కన మదమాంసాలు తినే అలగా జనాన్ని పెట్టుకుని ఉన్న మెలా తిన్ను? నోట ముద్ద మింగుడు పడుతుందా? ఛీ! ఛీ!" అసహ్యంగా ముఖంపెట్టి "యిదుగో! అందులో మీమామయ్య పోయిన నక్షత్రం కూడ మంచిది కాదు! ఆర్నెల్లు పాడెట్టాలి! బ్రాహ్మణ పుటకపుట్టి చూస్తూ చూస్తూ ఇంక ఈ కొంపలో యెలా వుంటాం?" అంది రహస్యంగా సోమిదేవమ్మ.

"అవును! అదీ నిజమే! అయితే యింకా నెల పూర్తి

కాలేదు కదా, దానికి నెల అద్దె ఇచ్చేస్తావా?" అంది మేన కోడలు.

"అయ్యో! యివ్వొద్దూ? ఇవ్వకపోతే అది ఊరుకుం టుందా? పీఠినపడి యాగీ చెయ్యదూ? అలగాజాతి, అలగా బుద్ధాలూను! అయినా దాని ఋణం మనకెందుకు?" పెద్ద వేదాంతిలా అంది సోమిదేవమ్మ.

వీధిలో నిల్చుని వీరి సంభాషణంతా విన్న పున్నమ్మ అదోలా నవ్వింది—

అది మామూలు నవ్వు కాదు!

లోకాన్నంతటినీ పూర్తిగా అవగాహన చేసుకుని, కురు క్షేత్ర రణరంగంలో పార్థునికి గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణ పరమాత్మ పార్థుని అమాయకత్వానికి జాలిగా, బాధగా, కోపంగా సర్వార్థాలూ గోచరించేలా నవ్విన నవ్వులా వుంది.

ఇంకా చెప్పాలంటే చిద్విలాసంగా ఉంది.

( ఆంధ్రసచిత్ర వారపత్రిక )

(०)—(०)